భానుడి ప్రతాపం.. పక్షుల తాపం

భానుడు భగ్గుమంటున్నారు. ఎండల తీవ్రతకు బయట కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనాలతో పాటు జీవాలు, పక్షులు అల్లాడిపోతున్నాయి. వేడి గాలులకు పక్షులు ఎక్కడ జలాశయాలు ఉంటే అక్కడికి వచ్చి వాలిపోతున్నాయి. శనివారం సూర్య ప్రతాపానికి గండిపేట మండలం నెక్నాపూర్ పెద్ద చెరువులో పక్షులు సేద తీరాయి. నీటిలో సయ్యాటలు ఆడుతూ కనిపించాయి.


- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా





క్రమశిక్షణకు ఆయన మారుపేరు. వృత్తి అధ్యాపకుడు.. ప్రవృత్తి రచనలు. సామాజికాంశాలపై విశ్లేషణలతోపాటు, రచయితగా రాణిస్తున్నారు. పరిగి పట్టణానికి చెందిన డాక్టర్ పుసుపుల భాస్కరయోగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఆయనకు సాహిత్య పరిశోధకుడు, రచయిత నాగలింగ శివయోగి ప్రేరణ. ఆయన స్ఫూర్తితో విభిన్న పుస్తకాలు, మూల గ్రంథాలు, వ్యాఖ్యాన గ్రంథాలను సేకరించారు. అనంతరం ఆయన ప్రాచీన, ఆధునిక సాహిత్యాల అనుసంధానం దిశగా అధ్యయనం సాగించారు. సాహితీ అంశాలపై భాస్కరయోగి ప్రస్థానం ఆయన మాటల్లోనే..

- పరిగి, మే17(ఆంధ్రజ్యోతి)



Sunday Special

వృత్తి బోధన.. ప్రవృత్తి రచన



గోరటి వెంకన్నతో భాస్కరయోగి(ఫైల్)

- సామాజిక అంశాల విశ్లేషణలో దిట్ట
- అనేక పత్రికలకు పలు శీర్షికలతో వ్యాస రచన
- ఇప్పటివరకు 25 పుస్తకాల ముద్రణ
- రచయితగా రాణిస్తున్న భాస్కరయోగి

6

జేపీ దర్గా టెండర్ మళ్లీ వాయిదా

- ముందుకురాని కాంట్రాక్టర్లు

కొత్తూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో ఉన్న రాష్ట్రంలోనే పేరుగాంచిన దర్గాగా గుర్తింపు పొందిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా టెండర్ మళ్లీ వాయిదా పడింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో శనివారం నిర్వహించిన జేపీ దర్గా టెండర్‌కు ఒక్కరు కూడా సీల్డ్ టెండర్ దాఖలు చేయలేదు. దాంతో వక్ఫ్‌బోర్డు అధికారులు టెండర్‌ను వాయిదా వేశారు. రెండు నెలల క్రితం దర్గా టెండర్‌ను ఏర్పాటు చేయగా అప్పుడు కూడా ఎవరూ ముందుకు రాకపోవడంతో వక్ఫ్‌బోర్డు టెండర్‌ను వాయిదా వేసింది. టెండర్‌ను 4కోట్ల రూపాయలకు నిర్ణయించగా, కాంట్రాక్టర్లు ఎవరూ కూడ ముందుకు రాలేకపోయారు. టెండర్‌ను రూ.2కోట్ల 75లక్షలకు తగ్గించి తిరిగి నోటిఫికేషన్ జారీ చేసినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. గతంలో టెండర్‌లను దక్కించుకుని నష్టాలు చవిచూడాల్సి వచ్చిందని పలువురు కాంట్రాక్టర్లు బాహాటంగా చర్చించడం కనిపించింది.

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తుంది. ఒకవైపు వాన గుబులు... మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. మద్దతు ధర దేవుడెరుగు... ధాన్యం విక్రయిస్తే చాలనుకుంటున్నారు. విధిలేక తక్కువ ధర అయినా పర్వాలేదని దళారులకు వడ్లు అమ్ముకుంటున్నారు. కొందరు ప్రైవేట్ వ్యాపారులు నేరుగా పొలాల వద్దకే వచ్చి పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో కేంద్రాలు వెలవెల బోతున్నాయి.

దళారులకే ధాన్యం..!

కేంద్రాల్లో కొనుగోళ్లకు కొర్రీలు

- తేమ శాతం, తరుగు అంటూ ఇబ్బందులు
- రైతులను వెంటాడుతున్న వాన భయం
- వడ్లను దళారులకు అమ్మేస్తున్న అన్నదాతలు
- వెలవెలబోతున్న కొనుగోలు కేంద్రాలు
- షాద్‌నగర్‌లో టెండర్లు వేయకుండానే విక్రయాలు



పొలం వద్దే ధాన్యం కొని బస్తాలను ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న ప్రైవేట్ వ్యాపారులు(ఫైల్)

రంగారెడ్డి అర్బన్/షాద్‌నగర్ అర్బన్/యాచారం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 1,314 మంది రైతుల నుంచి 6,189.640 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. రూ.500 బోనస్ కోసం చూస్తే తేమ శాతం 17 ఉండాలి. దానికోసం ధాన్యం ఆరబెట్టాలి. ధాన్యం ఆరబెడితే క్వింటాలుకు ఆరు నుంచి ఏడు కిలోల వరకు బరువు తగ్గుతుంది. ఆరబెట్టే పని, అకాలవర్షం భయం, డబ్బుల కోసం వేచి ఉండటం తదితర కారణాలతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం అమ్ముకుంటున్నారు. లాభం, నష్టం చూసుకోకుండా కొంత మంది రైతులు క్వింటాలు ధాన్యాన్ని రూ.1,900 నుంచి రూ.2వేలకే అమ్ముకుంటున్నారు. కొందరు ప్రైవేట్ వ్యాపారులు నేరుగా పొలాల వద్దకే వచ్చి పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో కేంద్రాలు వెలవెలబోతున్నాయి. షాద్‌నగర్‌లో టెండర్లు వేయకుండానే విక్రయాలు జరుపుతున్నారు.

కేంద్రాలు వెలవెల

జిల్లాలో ఈ సారి యాసంగిలో 95.134 ఎకరాల్లో వరి సాగుచేశారు. 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వరి ధాన్యం దిగుబడికి అనుగుణంగా 33 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 25 ఏర్పాటు చేశారు. 1,314 మంది

మిగతా 8వ పేజీలో...

ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్మిన



30 ఎకరాల్లో వరి సాగు చేశాను. 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు తరలిద్దామనుకుంటే 17 శాతం తేమ నిబంధన ఉంది. ధాన్యం అమ్మిన తర్వాత డబ్బుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండటంతో ప్రైవేట్ వ్యాపారులకు రూ.1950కు క్వింటాలు చొప్పున అమ్ముకున్నాను.

- ఈసరి లింగం, రైతు, కొందుర్గు

పరిహారం పొందిన రైతులు

సాగు చేయొద్దు

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

యాచారం, మే 17(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చి పూర్తి పరిహారం పొందిన రైతులు ఈ వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేయరాదని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు రైతులకు సూచించారు. కోర్టు వివాదంలో ఉన్న భూములకు మినహాయింపు ఉందని తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి నుంచి వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖలకు అందిన ఆదేశాల మేరకు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. ఫార్మాసిటీ కోసం యాచారం, కందుకూరు మండలాల రైతుల నుంచి 19.333 ఎకరాల భూములు సేకరించాల్సి ఉండగా యాచారం మండలంలోని తాటిపర్తిలో పట్టా భూములు 1492 ఎకరాల 30గుంటలు, అసైన్డ్ భూములు 417ఎకరాల 28గుంటలు, సేకరించారు. ఇందులో భూదాన్ భూములు కూడా ఉన్నాయి. మేడిపల్లిలో పట్టాభూములు 2261 ఎకరాల 39 గుంటల భూమి, అసైన్డ్ భూములు 1969 ఎకరాల 18 గుంటలు, కుర్మిద్దలో పట్టాభూములు 1742ఎకరాల 8గుంటలు, అసైన్డ్ భూమి 1443ఎకరాల 29గుంటలు, నానక్‌నగర్‌లో పట్టాభూములు 699 ఎకరాల 8గుంటలు, అసైన్డ్ భూమి 150ఎకరాల భూములను ప్రభుత్వం సేకరించింది. ఇంకా 2500 ఎకరాల భూములపై కోర్టు వివాదాలున్నాయి. కాగా, మండలంలోని నాలుగు గ్రామాల్లో సేకరించిన భూములకు నెల రోజులుగా ఫెన్సింగ్ వేస్తున్నారు. శని వారం కూడా టీజీఐఐసీ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగాయి.

- అధ్వానంగా జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు
- ప్రతిపాదనలకే పరిమితమైన 10 కిలోమీటర్ల విస్తరణ
- తరచూ ప్రమాదాలు...
- నరకం చూస్తున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, ఆర్అండ్‌బీ అధికారులు

గుంతలమయంగా జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి రోడ్డు



గోతులేర్పడి..

కంకర తేలి!

ఆమనగల్లు, మే17(ఆంధ్రజ్యోతి) : మూడు జిల్లాలు, రెండు జాతీయ రహదారులను కలిపే రోడ్డు నరకప్రాయంగా మారింది. అడుగడుగునా బీటీ కొట్టుకుపోయి కంకరతేలి కళాహీనంగా మారింది. పాడైన రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు నిత్యం వేదనకు లోనవుతున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైంది. ఆమనగల్లు- చారగొండ ప్రధాన రహదారి మధ్యలో ఉన్న ఈ అసంపూర్తి రోడ్డు విస్తరణ, మరమ్మతుల గురించి ఏళ్లకాలంగా

మిగతా 8వ పేజీలో...

ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



జంగారెడ్డి పల్లి - చంద్రాయన్ పల్లి మధ్య 10 కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. అడుగడుగునా కంకర తేలి గోతులు ఏర్పడ్డాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని ఐదేళ్లుగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నా స్పందన లేదు.

కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చంద్రాయన్‌పల్లి

పరిశోధనలతో దేశానికి మేలు

మొయినాబాద్ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫార్మసీ విభాగంలో పరిశోధనలు చేయడంతో దేశానికి ఎంతోమేలు జరుగుతుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. రవీందర్ అన్నారు. హిమాయత్ నగర్‌లోని యూనివర్సిటీలో ఫార్మసీ విభాగానికి చెందిన కొణతం మౌనిక డాక్టర్ డానియేల్ పర్యవేక్షణలో 'డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ సాలిడ్ లిపిడ్ నానో పార్టికల్స్ ఏ మోడ్రన్ ఫార్ములేషన్' అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. దాంతో ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రొ.రవీందర్ శనివారం వర్సిటీలో అందజేశారు. డీన్ క్రిస్టోఫర్, తదితరులున్నారు. అలాగే యూనివర్సిటీకి చెందిన కాసపోయిన కళ్యాణి ప్రియ రసాయనశాస్త్రంలో పీహెచ్‌డీ అందుకున్నారు. ప్రొఫెసర్ కుమార స్వామి జెల్ల మార్గదర్శకత్వంలో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ స్క్రీనింగ్ ఆఫ్ సమ్ న్యూ 1-8 నార్థిఫైరిడన్ డెరివేట్స్' అంశంపై పరిశోధన చేశారు. వైస్ చాన్సలర్ శంకర్‌లింగం పట్టా అందజేశారు.



మౌనికకు పట్టా అందజేస్తున్న ప్రొఫెసర్ రవీందర్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

6



ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం

- బీజేపీ నాయకులపై ఎంపీ మల్లు రవి ఫైర్

6



రోడ్లపై ధాన్యం.. వాహనదారుల్లో భయం

ఇబ్రహీంపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): రోడ్లను సగం ఆక్రమిస్తూ ధాన్యం ఆరబెడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఇలాగే బొంగులూరు సమీపంలో ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ రోడ్డులో ధాన్యం కుప్పలుగా పోసి పైన నల్లటి కవర్ కప్పి ఉంచారు. రాత్రి వేళ కనిపించక ధాన్యం కుప్పను మోటార్ సైకిల్ ఢీకొట్టి అదుపుతప్పి పడిపోవడంతో ఒకరు మృత్యువాతపడ్డారు. అక్కడక్కడ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ-రాందాస్‌పల్లి రోడ్డులో ఇలా ధాన్యం ఆరబోయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.



శేరిగూడ- రాందాస్‌పల్లి రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు


భక్తిశ్రద్ధలతో హోమాలు, గోపూజ

షాద్‌నగర్ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో పునర్ నిర్మాణం చేపట్టిన శివాలయం, రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శిథిలావస్థకు చేరుకున్న శివాలయం, రామాలయం పునరుద్ధరణకు గ్రామస్తులు ముందుకు వచ్చారు. ఈమేరకు మొదటి రోజు హోమాలు నిర్వహించారు. అంతకుముందు గోపూజ నిర్వహించారు. కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఎస్పీ షాద్‌నగర్ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు.

వేడుకలు, బరాత్‌లకు నో డీజే

- ముగ్గురిపై కేసు నమోదు

తాండూరు, మే 17(ఆంధ్రజ్యోతి): వేడుకలు, బరాత్‌లకు డీజే అనుమతి లేదని తాండూరు అర్బన్‌సీఐ సంతోష్ కుమార్ శనివారం తెలిపారు. పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రాత్రి సుమారు 1.30గంటల సమయంలో పట్టణం లోని సాయిపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా పెండ్లి వేడుకల్లో డీజే ఏర్పాటు చేయగా కుర్వ ఎల్లప్ప, డీజే సౌండ్ సిస్టమ్ యజమాని కుర్వ జగదీశ్, ఆపరేటర్ బుడగజంగం ఆదర్శ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.







అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు ఇవ్వని బీఆర్ఎస్ ● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, మే17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, కేసీఆర్, అప్పటి ఎమ్మెల్యేలు మాత్రం పెద్ద భవనాలు నిర్మించుకొని పేదలను గాలికొదిలేశారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నమని, పైలెట్ గ్రామాల్లో బేస్‌మెంట్ వరకు కట్టుకున్న ఇళ్లకు రూ.లక్ష చొప్పున ఇచ్చామని తెలిపారు. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, తెట్టెకుంగ తండాలలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. లబ్దిదారుల వద్దకు వెళ్లి భూమిపూజ చేసి అక్కడే ప్రొసీడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు హైదరాబాదులో నాలుగైదు భవనాలు నిర్మించుకున్నారని.. పేదలకు ఇళ్లు ఇవ్వడానికి వారికి చేతులు రాలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గ్రామం ఎక్లాస్‌ఖాన్‌పేటలో గత పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. త్వరలో అందరికీ రుణమాఫీ అవుతుందని భరోసా ఇచ్చారు.

పర్యటన సక్సెస్... ఆనందంలో కాంగ్రెస్ శ్రేణులు

ఎమ్మెల్యే పర్యటన సక్సెస్ కావడంతో కాంగ్రెస్ నాయకులు ఆనందంలో మునిగిపోయారు. ఎక్లాస్‌ఖాన్‌పేట మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్వగ్రామం కావడంతో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లికి ఘన స్వాగతం పలకడంలో నాయకుల మధ్య సమన్వయం కనిపించింది. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, తహసీల్దార్ ఆజంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, జగదీశ్వరప్ప, కృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, గిరిధర్ యాదవ్, రావుల పెంటయ్య, రూప్లానాయక్, శ్రీను నాయక్, యాదగిరిచారి, చేవెళ్ల నర్సింలు, అబ్బి సుందరయ్య, ఇబ్రహీం, కోడూరు రాములు, తైద పర్వతాలు, సురేష్ మాదిగ, భీమయ్య మాదిగ, చెన్నయ్య, పురుషోత్తంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రాణి, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఎక్లాస్‌ఖాన్‌పేటలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వృత్తి బోధన.. ప్రవృత్తి రచన

- సామాజిక అంశాల విశ్లేషణలో దిట్ట
- అనేక పత్రికలకు పలు శీర్షికలతో వ్యాస రచన
- ఇప్పటివరకు 25 పుస్తకాల ముద్రణ
- రచయితగా రాణిస్తున్న భాస్కరయోగి


డాక్టర్ భాస్కరయోగి రచించిన పుస్తకాలు

పరిగి, మే 17: ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇమ్మడిజెట్టి చంద్రయ్య వంటి వారి ప్రభావం, గోరేటి వెంకన్నతో సాన్నిహిత్యం భాస్కర యోగిని అధ్యాయనం, పరిశోధనల వైపు నడిపించాయి. ఆయన పాలమూరు జిల్లా సంకీర్తనా సాహిత్యంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా తీసుకున్నారు. ఈ పరిశోధన ద్వారా జిల్లాలోని అజ్ఞాత, విస్మృత కవులు 150 మంది చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చారు. అలాగే రాష్ట్రంలోని 330 మంది కవుల చరిత్ర తెలంగాణ పద సంకీర్తనలను రచించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పుస్తకం ముద్రించారు. అనేక కారణాలతో విస్మరణకు గురైన ఇక్కడి కవులు, సాహితీవేత్తల జీవిత చరిత్రలు తెలంగాణ ఆవిర్భావం అనంతరం వెలుగులోకి వస్తున్నాయి.

వ్యాస రచనతో మంచి పేరు

మొదట్లో పత్రికల్లో అడపాదడపా వ్యాసాలు రాయడాన్ని ప్రారంభించారు. దానికి స్థిరమైన రూపం రావడం లేదని భావించి 2016 నుంచి భాస్కర వాణి పేరుతో ఒక దిన పత్రికకు వ్యాసాలు రాశారు. అదే సమయంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో పరంజ్యోతి శీర్షికకు ఆధ్యాత్మిక కథనాలు రాశారు. ప్రతికల్లో రాసిన 60 వ్యాసాల సంకలనం ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రచురితమైంది. వ్యాస రచనతో పాటు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆయనకు మంచి పేరు తెచ్చాయి. వివిధ పత్రికలలో మాటకు మాట, కొక్కొరోకో, వర్తమాన భారతం తదితర శీర్షికలతో వ్యాసాలు రాస్తున్నారు.


మనపండుగల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి (ఫైల్)

నాటి పాల్కురికి నుంచి నేటివరకు

నాటి పాల్కురికి నుంచి నేటి వరకు సాహితీ సేవను, తెలంగాణ సమాజానికి వారు చేసిన కృషిని పరిశోధించి తెలంగాణ సాహిత్య సౌరభాలు పేర ఓ గ్రంథాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని ఇప్పడికే తెలుగు అకాడమీ ముద్రించింది. ఆయన యాదాద్రి క్షేత్రంలో సంకీర్తన కవిగా ఉన్న ఈగ బుచ్చిదాసు సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని కూడా తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించింది. వేపూరి హనుమద్దాసు చరిత్రను 2017 డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆవిష్కరించారు. ఆ సభల్లో వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న, ప్రముఖ పాటల రచయితలు సుద్దాల అశోక్, చంద్రబోస్ తదితరులు నిర్వహించిన గేయ తత్వకమిటీలో భాస్కరయోగి భాగస్వామిగా ఉన్నారు. మొత్తంగా ఇప్పటి వరకు విభిన్న అంశాలపై ఆయన రచించిన 25 పుస్తకాల వరకు ముద్రితమయ్యాయి.

సాహిత్యాన్ని మానవీయ దృష్టితో చూడాలి



సాహిత్యాన్ని మానవీయ దృష్టితో చూడాలి. వర్ధమాన కవులు అధ్యాయనం, అనుశీలనంపై దృష్టి సారించాలి. సిద్ధాంత విభేదాలను పక్కన పెట్టి అన్ని రకాల సాహిత్యాలను అధ్యాయనం చేయాలి. సంకుచిత దృష్టిని విడనాడాలి. చాలా మంది తత్వకవులు, వారి పేర్లను కూడా రాసుకోలేదు. అలాంటి వారిపై ఆధునిక పరిశోధకులు దృష్టి పెట్టాలి. ఎక్కడో ఇతర దేశాలకు చెందిన కవుల గురించి రాస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మనవాళ్లను పట్టించుకోవడం లేదు. సమాజాన్ని ప్రభావితం చేసిన వేపూరి హనుమద్దాసు, దున్న ఇద్దాసు లాంటి వారిని మనం విస్మరిస్తున్నాం.

-భాస్కరయోగి, రచయిత

వారంలోగా ధాన్యం డబ్బుల చెల్లింపు


చింతపట్లలో మహిళా రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ సూర్యారావు

యాచారం, మే 17(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు వారం రోజుల్లో డబ్బు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు డీఆర్డీఏ ఏపీడీ పి.సూర్యరావు వెల్లడించారు. వర్షానికి ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మండలంలోని చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు దారులు, రైతులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రతీ రైతుకు టార్పాలిన్ అందిస్తున్నామని. మండలాల్లోని వ్యవసాయశాఖ కార్యాలయాల్లో, రైతు వేదికల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఏపీడీ తెలిపారు. అదేవిధంగా మహిళా రైతులకు గ్రీన్‌హౌస్ నిర్మాణం కొరకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు వివరించారు. రెండు, మూడు ఎకరాల భూమి కలిగిన ఉన్న మహిళా రైతులకు గ్రీన్‌హౌస్ నిర్మాణం కోసం విరివిగా రుణాలందించి ఆదుకుంటామన్నారు. ఐకేపీ ఏపీఎం సాంబశివుడు, సీసీలు గణేష్, నర్సింహ, స్వరూప, రాజు తదితరులు ఉన్నారు.

కృష్ణస్వామికి జీవన సాఫల్య పురస్కారం


అవార్డు అందుకుంటున్న కృష్ణస్వామి

చేవెళ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): తల్లారం గ్రామానికి చెందిన కవి దుబ్బాకుల కృష్ణస్వామికి సాహిత్యంలో చేసిన సేవలకు గాను జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈనెల 16న నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్తంగా నిర్వహించిన అజరామరం చారిత్రక పద్య నాటకం, అనంత ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు బి.రాఘవేంద్రచార్యులు, తదితరులు కృష్ణస్వామికి జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. కృష్ణస్వామి మాట్లాడుతూ సాహిత్యంలో చేసిన సేవలకు ఈ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

వైభవంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన

ఘట్‌కేసర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో శనివారం బొడ్రాయి పున:ప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈసందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.


పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్



మాజీ బిల్ కలెక్టర్ రిమాండ్

ఘట్‌కేసర్‌రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులను దుర్వినియోగానికి పాల్పడిన మాజీ బిల్‌కలెక్టర్‌ను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. 2021-2022లో నాటి సర్పంచ్ సురేష్, కార్యదర్శి ఉష, బిల్‌కలెక్టర్ రజినికర్‌రెడ్డిలు గ్రామపరిధిలో వివిధ రూపాల్లో వచ్చిన పంచాయతీ నిధులు రూ.17 లక్షల25వేల నగదును వారి సొంతానికి వాడుకున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో నాటి డీపీవో పద్మజారాణి విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. ఈ మేరకు అప్పటి కార్యదర్శి మల్లారెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేశారు. ఈ మేరకు రజినికర్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తునట్లు సీఐ పరశురాం తెలిపారు.

క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలు

- వైద్యాధికారి తీరుపై విమర్శలు

పరిగి,మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శనివారం పరిగిలోనిపలు ప్రైవేట్ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు క్లినిక్‌లు నిబంధనలకువిరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడం, కనీస అర్హత లేకుండా క్లినిక్ నిర్వహించడంపై డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం పరిగిలోని కొడంగల్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో కూర్చునిఅక్కడికి ఆర్ఎంపీలను రప్పించి బేరసారాలు సాగించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నవారంతా సదరు అధికారిని మేనేజ్ చేసినట్లు విమర్శలు వెల్లువెత్తాయి.

యూనిఫాం సకాలంలో అందజేయాలి


డ్రెస్‌లు కుట్టే కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ రవికుమార్

తాండూరు, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వికారాబాద్ జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన టీఎంసీ రాజేంద్రప్రసాద్, కో-ఆర్డినేటర్ విశాలతో కలిసి సాయిపూర్, మల్‌రెడ్డిపల్లిలో డ్రెస్‌లు కుట్టే కేంద్రాలను పరిశీలించారు. ఈఏడాది 6, 7 తరగతుల విద్యార్థులకు ఫుల్‌డ్రెస్‌లు కుట్టిస్తున్నట్లు ఆయన చెప్పారు. అంతకుముందు ఆర్పీలు మెప్మాకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

పెట్టుబడిదారుల కోసమే అందాల పోటీలు

ఇబ్రహీంపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల లాభాలకోసమే అందాల పోటీలు నిర్వహిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య ఆరోపించారు. వివిధ దేశాల సుదరీమణులు శనివారం రామోజీ ఫిలిం సిటీ వచ్చిన సందర్భంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తుగా సీపీఎం నాయకులను అరెస్టు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా అందాల పోటీలు అవసరమా అంటూ యాదయ్య ప్రశ్నించారు. అందాల పోటీలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని మహిళల అభ్యున్నతికోసం ఈనిధులు ఖర్చు చేస్తే బాగుండేదని ఆయన అన్నారు. పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో ఐద్వా నాయకురాలు మస్కు అరుణ, సీపీఎం నాయకులు సామేల్, జగన్, ఎల్లేష్ తదితరులున్నారు.

ప్రభుత్వంపై బీజేపీ నాయకుల తప్పుడు ప్రచారం

● ఎంపీ మల్లు రవి


మాట్లాడుతున్న మల్లు రవి

ఆమనగల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిర పరిచి రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు సాగిస్తున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు సమన్వయంతో ముందుకు సాగుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అద్భుత ప్రగతి సాధిస్తుంటే బీజేపీ నాయకులు జీర్ణించుకోలేక కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం విలేకరుల సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ బీజేపీ శాసన సభ పక్ష నాయకుడు మహేశ్వర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, మంత్రివర్గ విస్తరణను సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నారని అనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని బీజేపీలో తీవ్రమైన వర్గపోరు కొనసాగుతోందని.. అందుకే చాలా కాలంగా బీజేపీ అధ్యక్ష ఎంపిక వాయిదాపడుతూ వస్తుందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని అన్నారు. బీజేపీ నాయకులు గోబెల్స్ వారసులని, అబద్దాల పునాదుల మీదనే వారి రాజకీయ జీవితం ఉందని మల్లు అన్నారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, కాలె మల్లయ్య, శ్రీను నాయక్, పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు కోల్పోయిన సబితారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, మే 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కును ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఏనాడో కోల్పోయారని, పదే పదే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కానీ, పార్టీ నాయకులను గానీ విమర్శిస్తే సబితారెడ్డి చేసిన మోసాలను కరపత్రాల రూపంలో బహిర్గతం చేయాల్సి వస్తుందని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సబితాఇంద్రారెడ్డికి రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్‌తో పాటు నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను నట్టేట ముంచి అధికార దాహంతో బీఆర్ఎస్ చేరిందని.. సబితారెడ్డి గతాన్ని మర్చిపోవద్దని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూ కబ్జాలు చేస్తూ ఆగడాలు చేసిన అనుచరులతో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిపై లేనిపోని ఆరోపనలు చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. దేప భాస్కర్‌రెడ్డి పుణ్యమా అని కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన సబితాఇంద్రారెడ్డి కాంగ్రెస్ నాయకులను, ప్రభుత్వాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగభృతి, దళితులకు 3 ఎకరాలు భూమి, దళిత ముఖ్యమంత్రి వంటి హామీలు అమలు చేయలేదని, పదేళ్లు రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా మింగిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను ప్రశ్నించే హక్కు ఏమాత్రం లేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు చేశారో ఎమ్మెల్యేగా సబితారెడ్డి ఆలోచించాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, నాయకులు అల్లె కుమార్, ప్రవీణ్, మంత్రి బాల్‌రాజ్, యాదయ్య, ఐ. నర్సింహ, భిక్షపతి, జావేద్, రాజు, లాజర్, సుభాష్ పాల్గొన్నారు.



యువతకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

యువత ఉన్నతస్థాయికి ఎదగాలి

షాద్‌నగర్ అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి శ్రమించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మైక్రోసాఫ్ట్ సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో 40 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలపై శిక్షణ ఇచ్చింది. రెండవ బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం షాద్‌నగర్ మున్సిపాలిటీ భవనంలో జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేసి, యువతను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ సునీత, సంస్థల ప్రతినిధులు రేఖా శ్రీనివాసన్, చందనా, హర్ష, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2.58 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర అందిస్తుందన్నారు. నాయకులు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, విజయ్‌రాథోడ్, కృష్ణ, జగన్, వెంకట్ రెడ్డి, బాబా, రవింద్, నరేశ్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ భవన నిర్మాణం పూర్తి చేయాలి



నాయకులతో కలిసి భవనాన్ని పరిశీలిస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భూ వివాదాన్ని పరిష్కరించి, అసంపూర్తి భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కళాశాల భవన నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అసంపూర్తి భవనాన్ని శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి పత్యానాయక్ పరిశీలించారు. కళాశాలకు సొంత భవనం లేక ఏళ్ల కాలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భూ వివాదం పరిష్కారం దిశగా పాలక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో రూ.4.50 కోట్లతో గత ప్రభుత్వంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణం పనులకు అవసరమైన నిధులు విడుదల చేసి పనులు పూర్తిచేయాలని కోరారు. వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని కోరారు. నాయకులు పంతూనాయక్, శ్రీను నాయక్, వస్పుల సాయిలు, పంతూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



భూమిపూజ చేస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, గ్రామస్థులు

షాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఎల్గొండగూడలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న 25 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి సొంత ఖర్చులతో పాఠశాలకు ప్రహరీ, గేటును ఏర్పాటు చేయిస్తానని చెప్పడంతో భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ అంజనేయులుగౌడ్, గ్రామస్థులు రవీందర్ రెడ్డి, యాదయ్య, బలరాం, శ్రీనివాసాచారి, మల్లారెడ్డి, సతీష్, రవి, శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాల వర్తింపు

కందుకూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ఎవరు అధైర్య పడవద్దని.. రాజకీయాలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు మంజూరవుతాయని మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్‌లు అన్నారు. శనివారం మండలంలోని నేదునూరులో నిర్వహించిన గ్రామసభలో కార్యదర్శి రాజేష్‌గౌడ్‌తో కలిసి వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చొరవతో నేదునూరు గ్రామంలో ఇప్పటి వరకు 111 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం మొదటి దశ నిధులు మంజూరైనట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ నిరంతరంగా నడుస్తుందని తెలిపారు.

దళారులకే ధాన్యం!



ధాన్యం రాక వెలవెలబోతున్న షాద్‌నగర్ ధాన్యం కొనుగోలు కేంద్రం

(ఐదో పేజీ తరువాయి)

రైతుల నుంచి 6,189.640 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశారు. 645 మంది రైతులు సన్న రకం ధాన్యం అమ్మారు. వారికి రూ.1.37కోట్లు బోనస్ అందనుంది. కేంద్రాల్లో, మిల్లర్లు తూకంలో భారీగా కోతలు విధించడం, హమాలీ ఖర్చులు తడిసి మోపెడవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దాంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అంతంత మాత్రంగానే వస్తుంది. అధిక ధాన్యం ప్రైవేట్‌కు తరలుతోంది.

కొందుర్గు పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

జిల్లాలోని కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో షాద్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ, ఎదిర, జాకారం, పెద్ద ఎల్కిచర్ల, ముట్పూర్ గ్రామాల్లో, కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో కొత్తపేటలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో శుక్రవారం నాటికి 24,630 బస్తాల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల భయంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టకుండానే మార్కెట్‌కు, రైస్ మిల్లులకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరగా చేసుకుంటున్న వ్యాపారులు తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

వెంటాడుతున్న వర్షం భయం

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్ముకునే దుఃఖ అన్నదాత అవస్థలు పడుతున్నాడు. వర్షం భయం వెంటాడుతుంది. అకాల వర్షాలు కురుస్తుండటంతో ధాన్యాన్ని ఆరబెట్టి మద్దతు ధరను పొందే అవకాశం ఉండటం లేదు. దీంతో ధాన్యాన్ని నేరుగా వ్యవసాయ మార్కెట్‌కు తెచ్చి తక్కువ ధరకే రైతులు విక్రయిస్తూ నష్టపోతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితి లేదు. దీంతో షాద్‌నగర్ రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి ఆరబెడుతున్నారు. అయితే ఇటీవల కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏటవాలుగా సీసీ వేయడంతో ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కౌలురైతు చిల్కమర్రి జంగయ్య ఆరబెట్టిన 15 బస్తాల ధాన్యం కొట్టుకుపోయింది.

మద్దతు ధర పొందలేకపోతున్న రైతులు

రైతులు ధాన్యంను ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలన్న అంశంపై రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గంగాని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాలుగాని ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. మార్కెట్ శాఖ అధికారులు సైతం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తక్కువ ధరకే ధాన్యం విక్రయిస్తూ నష్టపోతున్నారు.

టెండర్లు వేయకుండానే విక్రయాలు

షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయినా... వ్యాపారులు కుమ్మకై తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నా మార్కెట్ శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మూడు రోజులుగా టెండర్లు వేయకుండానే వ్యాపారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నా ఆఫీసుకే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధర సన్నాలకు 2,320 రూపాయలు, 500 రూపాయల బోనస్ ఉండగా, దొడ్డు రకాలకు 2,300 రూపాయల ధర ఉంది. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మాత్రం 1750 రూపాయల నుంచి 1900 రూపాయల ధరకు టెండర్లు లేకుండానే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు అమ్మిన ధాన్యం వివరాలు

	దొడ్డు రకం	సన్న రకం	మొత్తం
ఐకేపీ	60	15	75
పీఏసీఎస్	282	582	864
డీసీఎంఎస్	327	48	375
మొత్తం	669	645	1,314

యాచారంలో నత్తనడకన కొనుగోళ్లు

యాచారం మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. దళారులు పంట పొలాల వద్దకు వచ్చి పచ్చిగా ఉన్న వడ్లు కొనుగోలు చేస్తున్నారు. షాద్‌నగర, కడ్తాల్, మిర్యాలగూడ ప్రాంతాలకు ధాన్యంను తరలిస్తున్నారు. క్వింటాలు ధాన్యానికి రూ.2 వేల నుంచి రూ.2,100 చెల్లిస్తున్నారు. యాచారం మండలంలో యాచారం, నందివనపర్తి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. చింతపట్లలో 38 మంది రైతుల నుంచి 1902 క్వింటాళ్లు, నందివన పర్తి నుంచి 24 మంది రైతుల నుంచి 918.80 క్వింటాళ్లు, యాచారంలో 16 మంది రైతుల నుంచి 1100 బస్తాల ధాన్యం సేకరించారు. అలాగే మంతగౌరెల్లిలో 37 మంది రైతుల నుంచి 1659 క్వింటాళ్లు సేకరించారు.

ధాన్యం కొనుగోలు వివరాలు

	ప్రతిపాదిత కేంద్రాలు	ఓపెన్ చేసిన కేంద్రాలు	ధాన్యం అమ్మిన రైతులు	ధాన్యం మెట్రిక్ టన్నులు
ఐకేపీ	03	02	75	321.840
పీఏసీఎస్	23	16	864	399.360
డీసీఎంఎస్	07	07	375	1874.440
మొత్తం	33	25	1,314	6,189.640

వర్షంతో భారీ నష్టం



రెండు రోజుల క్రితం కురిసిన వానకు షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో ఎండబెట్టిన 15 బస్తాలకు పైగానే వడ్లు కొట్టుకుపోయాయి. మిగిలిన వడ్లు పూర్తిగా తడిసిపోయాయి. సేట్లు కొన్న 90 బస్తాల వడ్లు తడిసిపోయాయని వదిలేశారు. వాటిని కూడ మూడు రోజులుగా ఎండబెడుతున్నా. కౌలుకు భూమి తీసుకుని పండించిన వడ్లను అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్న.

- చిల్కమర్రి జంగయ్య, కౌలు రైతు, అన్నారం

నాణ్యమైన ధాన్యాన్ని కొంటున్నాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం. తూర్పార పట్టిన ధాన్యం 17శాతం లోపు తేమ ఉంటే తప్పక కొనుగోలు చేస్తున్నాం. వ్యవసాయ శాఖ అధికారుల వద్ద తీసుకునే టోకెన్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం తీసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేస్తున్నాం.

- ఎండీ షరీఫ్, సీఈవో, కొందుర్గు పీఏసీఎస్

గోతులేర్పడి.. కంకర తేలి!

(ఐదో పేజీ తరువాయి)

ఎవరూ పట్టించుకోవడం లేదు. మరమ్మతుల విషయంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారుల ఉదాసీనం, పాలక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ప్రజలకు ఆగ్రహాన్ని తెప్పిస్తుంది.

ఏడేళ్లుగా ఎదురుచూపు

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఆమనగల్లు - చారగొండ రోడ్డును 15ఏళ్ల క్రితం ఆర్అండ్‌బీ శాఖలోకి మార్చారు. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారి ఆమనగల్లు నుంచి సిరనగండ్ల మీదుగా మహబూబ్ నగర్ - మిర్యాలగూడ జాతీయ రహదారి చారగొండ వరకు 27 కిలోమీటర్ల రోడ్డుకు గాను... ఐదేళ్ల క్రితం 12 కిలోమీటర్ల మేర విస్తరణ చేపట్టారు. మరో 15 కిలోమీటర్లు పూర్తయితే రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల మధ్య రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది. రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది. సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును ఆమనగల్లు నుంచి జంగారెడ్డిపల్లి వరకు, మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సిర్సనగండ్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. జంగారెడ్డిపల్లి గ్రామ సమీపం నుంచి చంద్రాయన్‌పల్లి వరకు మధ్యలో 10 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు చేపట్టలేదు. ఉన్న సింగిల్ రోడ్డు కూడ పూర్తిగా దెబ్బతింది. జంగారెడ్డిపల్లి, మాలెపల్లి, పోలెపల్లి గేటు మీదుగా చంద్రాయన్‌పల్లి వరకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. ఇకపోతే రెండేళ్ల క్రితం గోతుల్లో, సైడ్‌లలో మట్టి పోసి చదును చేసినా.. ఆతర్వాత వర్షాలకు కొద్దిరోజులకే యథాస్థితికి చేరుకుంది. కాగా, కొన్నిచోట్ల మోకాళ్ల లోతు గోతులేర్పడ్డాయి.

శంకుస్థాపనకే పరిమితం

ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు పాడైన బీటీరోడ్డును ఆధునికీకరించి డబుల్‌రోడ్డుగా విస్తరించాలని ఏళ్ల కాలంగా స్థానికులు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.2.86 కోట్లు మంజూరు చేసింది. 2023 ఆగస్టు 29న పనుల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఏడాది గడిచినా నేటికీ పనులు ప్రారంభించలేదు. పనులకు ఏడుసార్లు టెండర్లు నిర్వహించినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాక నిధులు ల్యాప్స్ అయినట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయన్‌పల్లి వరకు డబుల్ రోడ్డుగా నిర్మించేలా రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

నిధులు మంజూరయ్యాయి



ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు పాడైన బీటీ రోడ్డు మరమత్తుకు రూ. 1.09 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వీలైనంత త్వరగా టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తాం. రోడ్డు విస్తరణకు కూడా ప్రభుత్వానికి నివేదించాం.

- రవీందర్ గౌడ్, డీఈ, ఆర్అండ్‌బీ


మోదీ దిష్టిబొమ్మ దహనం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, మే 17(ఆంధ్రజ్యోతి): బిహార్‌లోని దర్భంగలో అంబేడ్కర్ హాస్టల్‌లో దళిత విద్యార్థులను కలిసి వారి సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని బీజేపీ, జేడీయూ ప్రభుత్వం అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కడ్తాల మండల కేంద్రంలో శనివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండలాధ్యక్షుడు బోసు రవి హాజరయ్యారు. జెండాలు చేబూని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైటాయించి బీజేపీ, జేడీయు ప్రభుత్వానికి నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై మోదీ, సీఎం నితీష్ కుమార్‌ల దిష్టిబొమ్మలను దహనం చేసి బీజేపీ, జేడీయూలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూత్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు భానుకిరణ్, శ్రీకాంత్, ఆకాశ్‌గౌడ్, రమేశ్, దర్శన్, విజ్జు, మహేందర్, యశ్వంత్, శివ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి కార్యవర్గాలను ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

మొయినాబాద్ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలంటే కాంగ్రెస్ అధిష్టానం జిల్లా, మండల కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు కీసరి సంజీవరెడ్డి సూచించారు. శనివారం అజీజ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని.. భవిష్యత్తులో మరెన్నో పథకాలు పెట్టే ఆలోచనలో ఉందన్నారు. వీటిని ప్రజల్లో తీసుకువెళ్లాలని తెలిపారు. ఇందుకోసం జిల్లా, మండల స్థాయి కార్యవర్గాలను ఎన్నుకుంటే నాయకులు పథకాలను ప్రజల్లోకి ఉత్సాహంగా తీసుకెళతారని, పార్టీ అభివృద్ధికి పనిచేస్తారని చెప్పారు. కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల నుంచి వచ్చినవారు పార్టీ అభివృద్ధికి పాటుపడాలని.. స్వలాభం కోసం పనిచేయడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని.. ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవరముందన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం 202వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఉప్పల వెంకటేశ్

గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ

ఆమనగల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామంలో మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు అధినేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ గర్భిణులకు స్థానిక నాయకులతో కలిసి కిట్లను పంపిణీ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ రాజావర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, బ్రహ్మం, శ్రీనివాస్‌యాదవ్, జంగయ్యగుప్త, వంశీ, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి జూలపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



తలకొండపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలకు ముస్తాబైంది. దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మూడు రోజుల పాటు కొనసాగే వేడుకల సందర్భంగా నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ సీజ్.. ఇద్దరిపై కేసు

చౌదరిగూడ, మే 17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు సీజ్‌చేసి నిందితులపై కేసు నమోదు చేశారు. ఎస్సై విజయ్ కథనం మేరకు.. మండల పరిధి గాలిగూడ గ్రామానికి చెందిన దివిటి శ్రీను, క్యాతమోని వెంకటేష్‌లు ఇసుక ఫిల్టర్ ఏర్పాటు చేశారు. ఈమేరకు శనివారం ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కాగా, పోలీస్ విభాగంలో పనిచేసే ఓ వ్యక్తి అండదండలతో ఇసుక దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం.

ఆదివాసీల ఆత్మగౌరవం పెంచిన రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మండ్లీ రాములు

ఆమనగల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ బిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు, చెంచు సేవా సంఘం రాష్ట్ర నేత మండ్లీ రాములు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులుతో కలిసి విలేకరుల సమావేశంలో రాములు మాట్లాడారు. గిరిజన, చెంచు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పోడుభూముల్లో ఉచితంగా బోర్లు తవ్వించి సౌర విద్యుత్ సదుపాయం పంపు సెట్లను అందించడానికి రూ.12,600 కోట్లతో ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 19న సీఎం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధి మాచారంలో ఈ పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని.. ఉమ్మడి పాలమూరు జిల్లా ఆదివాసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, వస్పుల మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

'రైతులు కష్టాల్లో ఉంటే.. అందాల పోటీలకు రూ.కోట్లలో ఖర్చా!'

కేశంపేట, మే 17(ఆంధ్రజ్యోతి): రైతుబంధు రాక, రుణమాఫీ కాక రైతులు కష్టాల్లో ఉంటే ప్రపంచ అందగత్తెల పోటీలు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెడుతోందని బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని సంతాపూర్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. యాసంగి రైతుబంధు నేటికీ అందలేదని.. మరో 15 రోజుల్లో వానాకాలం రైతుబంధు సమయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. పంట రుణాలు పూర్తి స్థాయిలో మాఫీ కాక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే యాసంగి, వానాకాలం రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలను గిట్టుబాటు ధర కల్పించడం లేదని, ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, తిరుపతి, కృష్ణ, జయపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టోర్నీలు దోహదం

కందుకూరు, మే 17(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించుకునేందుకు టోర్నమెంట్‌లు ఎంతో దోహదపడతాయని బైరాగిగూడకు చెందిన నాయకులు ఇమ్రాన్, పి.వెంకటేష్‌లు అన్నారు. మండలంలోని గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిశాయి. గెలుపొందిన టీంకు వారు బహుమతులందజేశారు. మొదటి బహుమతి ఎస్ఆర్‌హెచ్ టీంకు ఇమ్రాన్ రూ.15వేల నగదుతో పాటు షీల్డు అందజేశారు. ద్వితీయ బహుమతిని గెలుపొందిన ముంబై ఇండియన్స్ టీంకు పి.వెంకటేష్ రూ.10వేల నగదు, షీల్డును అందజేశారు. నాయకులు పి.బాబు, పి.కృష్ణ, జి.బాబు, పి.శివ, జి.నరసింహ, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఇమ్రాన్, వెంకటేష్ తదితరులు